గురువారం 21 మే 2026

# తెలంగాణ గీతం

తెలుగు దినపత్రిక

సంపుటి : 01 • సంచిక : 82 • పేజీలు : 4 • వెల రూ. 4/-

రంగారెడ్డి, నల్గొండ,ఖమ్మం, మెదక్, యాదాద్రిభువనగిరి,సూర్యాపేట,వరంగల్, నాగర్ కర్నూల్, హైదరాబాద్,వికారాబాద్, మహబూబ్నగర్, జనగాం, ములుగు,

**విలేకరులు కావలెను**

రిపోర్టర్లు కావలెను తెలంగాణలో తెలంగాణ గీతం తెలుగు దినపత్రిక కోసం జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు మరియు నియోజకవర్గ మరియు మండలాల వారీగా రిపోర్టర్స్ కావలెను సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ 8985188834

## పేదలకు ఉచిత వైద్యం తప్పనిసరి..

- ప్రైవేట్ ఆసుపత్రులకు సుప్రీంకోర్టు గట్టి హెచ్చరిక!
- సామాన్యులకు వైద్యం అందని ద్రాక్ష కావొద్దని గట్టిగా చెప్పిన న్యాయస్థానం..
- ప్రభుత్వ రాయితీలు, తక్కువ ధరల భూములపై నిర్మించిన ప్రైవేట్ ఆసుపత్రులు పేద రోగులకు ఉచిత సేవలు అందించాల్సిందేనని స్పష్టం
- గతంలో ఇచ్చిన తీర్పులను బేఖాతరు చేస్తున్న యాజమాన్యాలపై కోర్టు తీవ్ర అసహనం
- నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు




## నకిలీ సోషల్ మీడియా అకౌంట్స్‌పై ఉక్కుపాదం

- నీట్ పరీక్షకు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు
- కేంద్ర భద్రతా, నిఘా సంస్థలతో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం
- పరీక్షను సురక్షితంగా, పటిష్టంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు అప్రమత్తతను పెంచాలి
- పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలి



## జలమండలిలో అవినీతి జలగలు!

- కుర్చీ వదలరు – అక్కడి నుంచి కదలరు
- హైదరాబాద్ జలమండలిలో అవినీతిపై మరోసారి తీవ్ర చర్చ
- జలమండలిలో ఏ పనికైనా కమీషన్లు
- ప్రాజెక్టుల విభాగంలో రూ.కోట్ల దందా
- జలమండలిలో సంవత్సరాలుగా కొనసాగుతున్న అవినీతి వ్యవస్థపై చర్చ




హైదరాబాద్

హైదరాబాద్ మహానగరానికి తాగునీటిని అందించే జలమండలిలో అవినీతి ఆరోపణలు మళ్లీ తీవ్ర చర్చకు దారితీశాయి. నల్లాల కనెక్షన్ల మంజూరు నుంచి భారీ ప్రాజెక్టుల నిర్మాణాల వరకు అక్రమాలు సాధారణ వ్యవహారంగా మారాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇటీవల జలమండలి ప్రాజెక్టుల విభాగం జనరల్ మేనేజర్ కుమార్ ఇంట్లో ఏసీబీ సోదాలు నిర్వహించి భారీ స్థిర, చరాస్తులను గుర్తించడం ఈ వ్యవహారాన్ని మరింత సంచలనంగా - మిగతా3లో



## ఆర్థిక తుపాను రాబోతుంది

- మహనీయుల విగ్రహాల ముందు తలలు వంచడం పెద్ద ఫ్యాషన్‌గా మారింది
- మహనీయులను స్మరించుకుంటున్నామే తప్ప, వారు నమ్మిన సిద్ధాంతాలను సరిగ్గా కాపాడుకోలేకపోతున్నామని రాహుల్ వ్యాఖ్య
- రాబోయే రోజుల్లో రైతులకు ఎరువులు కూడా దొరకని పరిస్థితి రానుంది
- రానున్న కొద్ది నెలల్లో ద్రవ్యోల్బణం ఎక్కడికి చేరుతుందో. పెట్రోల్, డీజిల్, గ్యాస్, పప్పుధాన్యాలు, బియ్యం ధరలు ఎక్కడికి చేరుతాయో మీరే చూడండి

## అంతర్జాతీయ స్థాయి సంస్థలు ఫ్యూచర్‌సిటీకి



- హెల్త్ క్లస్టర్ ఫ్యూచర్ సిటీ వచ్చేలా చర్యలు
- ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో పరిశ్రమల శాఖపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష
- ఫ్యూచర్ సిటీలో భూముల కేటాయింపు, పరిశ్రమల ఏర్పాటుపై చర్చ
- అంతర్జాతీయ స్థాయి సంస్థలను ఫ్యూచర్‌సిటీకి తీసుకురావాలని వెల్లడి

హైదరాబాద్

భారత్ ఫ్యూచర్ సిటీలో అంతర్జాతీయ స్థాయిలో మౌలిక వసతులు కల్పించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. వచ్చే నెలలో ఫ్యూచర్ సిటీ ఇండ్రస్టియల్ పార్క్‌లో పరిశ్రమలకు శంకుస్థాపనలు జరిగేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. బుల్లెట్ ట్రైన్ కోసం భూ సేకరణ ప్రారంభించాలని, ఫ్యూచర్ సిటీలో 1500 ఎకరాల్లో డేటా సిటీ ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రానికి పెట్టుబడులు ఆకర్షించేందుకు 'ఇన్వెస్ట్ తెలంగాణ' పేరుతో ప్రత్యేక విభాగం ఏర్పాటు చేయాలని - మిగతా3లో

## సీఏఏ పరిధిలోకి రాని ప్రతి ఒక్కరూ చొరబాటుదారులే

- వారిని దేశం నుంచి పంపించేస్తాం : బంగాల్ సీఎం
- సరిహద్దు కంచె కోసం దీూఖీకు భూమిని అప్పగించిన బంగాల్ సర్కార్
- గత ప్రభుత్వ ఓటు బ్యాంకు రాజకీయాలు వల్ల భూమి బదిలీ నిలిచిపోయింది
- బంగాల్ రాష్ట్రం బంగ్లాదేశ్‌తో సుమారు 2,200 కిలోమీటర్ల మేర అంతర్జాతీయ సరిహద్దును పంచుకుంటోంది



## హైదరాబాద్ మెట్రో రైలు విస్తరణ



- చెరో 50 శాతం చొప్పున ముందుకెళ్లేందుకు కేంద్రం సిద్ధం
- హైదరాబాద్ ప్రాజెక్టులపై కేంద్రమంత్రులు ఖట్టర్, కిషన్ రెడ్డి సమీక్ష
- హైదరాబాద్ మెట్రో విస్తరణ, మూసీ ప్రక్షాళనపై చర్చ
- మెట్రో విస్తరణకు సూత్రప్రాయ అంగీకారం
- కేంద్ర, రాష్ట్రాలు చెరో సగం ఖర్చుతో ముందుకెళ్లేందుకు సిద్ధం



## ఏఐఏడీఎంకే మద్దతు తీసుకోవద్దు

- అది ప్రజాతీర్పునకు వ్యతిరేకం
- టీవీకేకు సీపీఐ(ఎం) హెచ్చరిక
- తమిళనాట రసవత్తర రాజకీయాలు
- ఏఐఏడీఎంకే మద్దతు తీసుకోవద్దని టీవీకేకు సీపీఐ(ఎం) హెచ్చరిక
- అది ప్రజాతీర్పునకు విరుద్ధమని వ్యాఖ్య

## విద్యారంగ పెట్టుబడులకు ఎఫ్ఆర్‌బీఎం మినహాయింపు ఇవ్వండి

- నిర్మలమ్మకు భట్టి రిక్వెస్ట్
- రాష్ట్రానికి సంబంధించిన వివిధ అంశాలపై కేంద్ర ఆర్థిక మంత్రితో భట్టి చర్చ
- ఎస్ఏఎస్‌సీఐ కింద రాష్ట్రానికి అదనంగా రూ.5 వేల కోట్లు ఇవ్వాలని విజ్ఞప్తి
- యంగ్ ఇండియా స్కూల్స్ గురించి కేంద్రమంత్రికి వివరణ



హైదరాబాద్

దిల్లీలో పర్యటిస్తున్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో సమావేశమయ్యారు. రాష్ట్రానికి సంబంధించిన వివిధ అంశాలపై కేంద్రమంత్రితో చర్చించారు. ఆపై ఎస్ఏఎస్‌సీఐ కింద రాష్ట్రానికి అదనంగా రూ.5 వేల కోట్లు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. మరోవైపు రాష్ట్రం లోని విద్య, వైద్యం, గ్రామీణ మౌలిక వసతులను వివరించిన భట్టి విక్రమార్క, మానవ వనరుల అభివృద్ధికి రాష్ట్రం చేపట్టిన కార్యక్రమాల వివరాలను తెలిపారు. యంగ్ ఇండియా స్కూల్స్ గురించి కేంద్రమంత్రికి వివరించిన - మిగతా3లో

# ఆర్థిక తుపాను రాబోతుంది

దేశ రాజ్యాంగంపై నిరంతరాయంగా దాడులు జరుగుతున్నాయని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. రాజ్యాంగాన్ని బలహీనపరిచే కుట్రలు సాగుతున్నాయని, దీన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పిలుపునిచ్చారు. ఉత్తర్‌ప్రదేశ్ రాయ్‌బరేలీలో జరిగిన బహుజన్ స్వాభిమాన్ సభలో రాహుల్ గాంధీ పాల్గొన్నారు. భారత రాజ్యాంగం అనేది కేవలం ఒక సాధారణ పత్రం కాదని, అది డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, మహాత్మా గాంధీ సిద్ధాంతాలకు సజీవ రూపమని తెలిపారు. మహనీయులను స్మరించుకుంటున్నామే తప్ప, వారు నమ్మిన సిద్ధాంతాలను సరిగ్గా కాపాడుకోలేకపోతున్నామని చెప్పారు. మహనీయుల విగ్రహాల ముందు తలలు వంచడం పెద్ద ఫ్యాషన్‌గా మారిందని, కానీ అదే మహనీయులు రాసిన రాజ్యాంగంపై, వారు నమ్మిన సిద్ధాంతాలపై దాడులు జరుగుతుంటే మాత్రం అందరూ మౌనంగా ఉంటున్నారని మండిపడ్డారు. రాజ్యాంగంపై ప్రధాని మోదీ రోజు దాడి చేస్తూనే ఉన్నారని ఆరోపించారు. ఉపాధి హామీ పథకాన్ని బలహీనపరచడం, దేశంలో కుల గణన చేపట్టకపోవడం ఇందులో భాగమేనన్నారు. దేశ ప్రయోజనాలను పణంగా పెట్టి అంబానీ, అదానీ వంటి పెద్ద పారిశ్రామికవేత్తల ప్రయోజనాలకే కేంద్ర ప్రభుత్వం తొలి ప్రాధాన్యం ఇస్తోందని రాహుల? గాంధీ దుయ్యబట్టారు.



"ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విదేశాలకు వెళ్లొద్దు, బంగారం కొనొద్దు, ఎలక్ట్రిక్ వాహనాలు కొనండి అని చెప్తున్నారు. ఆయనే స్వయంగా వేల కోట్ల రూపాయల విలువైన విమానాల్లో విదేశీ పర్యటనలకు వెళ్తున్నారు. రాబోయే రోజుల్లో రైతులకు ఎరువులు కూడా దొరకని పరిస్థితి రానుంది. ఆర్థిక తుపాను రాబోతుంది. మీరే చూడండి. రానున్న కొద్ది నెలల్లో ద్రవ్యోల్బణం ఎక్కడికి చేరుతుందో. పెట్రోల్, డీజిల్, గ్యాస్, పప్పుధాన్యాలు, బియ్యం ధరలు ఎక్కడికి చేరుతాయో మీరే చూడండి. ఎన్నికలకు ముందు దేశంలో పెట్రోల్, గ్యాస్ కొరత ఏమీ లేదని ప్రధాని చెప్పారు. పెట్రోల్ ధరలు పెరగవన్నారు. ఈరోజు పెట్రోల్ ధరలు పెరుగుతుంటే అంబానీ మాత్రం భారతదేశం నుంచి విదేశాలకు పెట్రోల్‌ను ఎగుమతి చేస్తున్నారు. అంబానీ రష్యా నుంచి పెట్రోల్‌ను కొనుగోలు చేసి విదేశాల్లో విక్రయిస్తున్నారు. ఆ డబ్బుతోనే ప్రధానికి నిధులు సమకూరుస్తున్నారు."

**'అలా చేయకుండా మెలోనితో కలిసి చాక్లెట్లు తిని వీడియోలు చేశారు'**

మరోవైపు ఇటలీ ప్రధాన మంత్రి జార్జియా మెలోనికి ప్రధాని మోదీ మెలోడి చాక్లెట్లు ఇవ్వడంపైనా రాహుల్? స్పందించారు. ప్రజల రక్షణ కోసం చర్యలు తీసుకోవాల్సిన ఆయన, ఇటలీ ప్రధానితో చాక్లెట్లు తిని వీడియోలు తీశారని ఎద్దేవా చేశారు. అమేఠీలో నిర్వహించిన సభలో మాట్లాడిన ఆయన ఈ మేరకు ప్రధాని మోదీపై విమర్శలు గుప్పించారు. "మనకు చమురు హార్ముజ్ జలసంధి గుండా వస్తుంది కానీ ఇప్పుడు దానిని మూసివేశారు. అయినా, ఇటీవలి అసెంబ్లీ ఎన్నికలకు ముందు చమురు, గ్యాస్, పెట్రోల్ కొరత లేదని, అంతా బాగానే ఉందని ప్రధాని నరేంద్ర మోదీ చెప్పారు. గత రెండు నెలలుగా పార్లమెంటులోనూ, ప్రసంగాల్లోనూ ఒక ఆర్థిక తుఫాను రాబోతోందని నేను నెలల తరబడి చెబుతూనే ఉన్నాను. దీని వల్ల రైతులు, కార్మికులు, యువత, సోదరీమణులు తీవ్రంగా నష్టపోబోతున్నారు. ఇలా చెబితే బీజేపీ నాయకులు నన్ను ఎగతాళి చేస్తున్నారు. ప్రజలను రక్షించడానికి, వారికి ఆర్థిక రక్షణ కవచం కోసం నరేంద్ర మోదీ గత మూడు నెలలుగా చర్యలు తీసుకోవాల్సింది. కానీ ఆయన అలా చేయలేదు. దానికి బదులుగా ఆయన ఇటలీ ప్రధానమంత్రి జార్జియా మెలోనితో కలిసి చాక్లెట్లు తిని వీడియోలు చేశారు." అని రాహుల్ గాంధీ అన్నారు.

"ఇటలీ ప్రధానమంత్రి జార్జియా మెలోనిని కలవడానికి వెళ్లే ముందు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ భారత ప్రజలతో ఒక ఆర్థిక తుఫాను రాబోతోందని చెప్పారు. ప్రజలు పెట్రోల్ తక్కువగా వాడాలని, బంగారం కొనవద్దని, తక్కువ ఖర్చు చేయాలని, విదేశాలకు ప్రయాణించడం మానుకోవాలని అన్నారు. కానీ, కేవలం ఒక్క రోజు తర్వాత మోదీ తన జేబులో చాక్లెట్లు పెట్టుకుని రూ. 3,000-4,000 కోట్ల విలువైన విమానం ఎక్కి ఇటలీకి వెళ్లారు. అక్కడ ప్రధానమంత్రికి మెలోని చాక్లెట్ ఇచ్చారు. ఈ దేశ ప్రజలను ఏ విధంగా అపహాస్యం చేస్తున్నారో ఇప్పుడు చూడండి. పెట్రోల్, గ్యాస్ కొరత ఉంది. వ్యాపారాలు, ఫ్యాక్టరీలు మూతపడుతున్నాయి. ద్రవ్యోల్బణం పెరుగుతోంది, రైతులకు ఎరువులు అందడం లేదు, మొత్తం పారిశ్రామిక వ్యవస్థ కుప్పకూలుతుంది. 'పెద్ద నోట్ల రద్దు తర్వాత నల్లధనాన్ని నిర్మూలించకపోతే నన్ను ఉరితీయండి' అని నరేంద్ర మోదీ అన్నారు. మీకు గుర్తుందా? ఆయన చేతులు జోడించి ఏడుస్తూ ఆ మాట అన్నారు. కొవిడ్ సమయంలో లాక్‌డౌన్ విధించారు, కార్మికులు నష్టపోయారు, రైతులు నాశనమయ్యారు. ఇప్పుడు మరోసారి చేతులు జోడించి ఏడ్చే సమయం వస్తోంది." అని రాహుల్ గాంధీ అన్నారు.

# ఏఐఏడీఎంకే మద్దతు తీసుకోవద్దు

తమిళనాట విజయ్ నేతృత్వంలోని టీవీకే సర్కార్‌కు ఆదిలోనే తీవ్ర అడ్డంకులు ఏర్పడుతున్నాయి. టీవీకే సర్కార్ ఒకవేళ ఏఐఏడీఎంకే మద్దతు స్వీకరించినా లేదా ఆ పార్టీని మంత్రివర్గంలో చేర్చుకున్నా, తాము వెలుపల నుంచి ఇస్తున్న మద్దతును పునఃసమీక్షించుకోవాల్సి ఉంటుందని సీపీఐ(ఎం) తమిళనాడు రాష్ట్ర కార్యదర్శి పి.షణ్ముగం హెచ్చరించారు. మంగళవారం తిరువారూర్ జిల్లా తిరుతురైపూండిలో విలేకరులతో మాట్లాడిన షణ్ముగం, రాష్ట్రంలో రాజకీయ స్థిరత్వాన్ని కాపాడటానికి మాత్రమే విజయ్ సర్కార్?కు మద్దతు ఇచ్చామని తెలిపారు. గవర్నర్ పాలన పేరుతో దొడ్డిదారి గుండా బీజేపీ అధికారంలోకి రాకుండా నిరోధించడానికే తాము టీవీకేకు అండగా నిలిచామని పేర్కొన్నారు. "108 స్థానాలతో అతిపెద్ద పార్టీగా అవతరించిన టీవీకేకు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే హక్కు ఉంది. అందుకే బీజేపీ ప్రభుత్వం గవర్నర్ పాలన పేరుతో ఇక్కడ దొడ్డిదారిన పాలన చేయకూడదని మేము భావించాం. తమిళనాట మళ్లీ ఎన్నికలు జరగకూడదనే ఉద్దేశంతోనే మేము విజయ్ సర్కార్?కు మద్దతు ఇచ్చాం" అని అన్నారు.



"తమిళనాడులో ప్రత్యామ్నాయ పరిపాలన అందిస్తామనే వాగ్దానంతో విజయ్ అధికారంలోకి వచ్చారు. కాబట్టి ఆల్ ఇండియా అన్నా ద్రవిడ మున్నేట్ర కజగం (ఏఐఏడీఎంకే)ను ప్రభుత్వంలో భాగం చేయడం సరికాదు. ప్రజలు ఏఐఏడీఎంకే, డీఎంకే పార్టీలకు ప్రత్యామ్నాయంగా టీవీకేకు ఓటు వేశారు. అలాంటి పార్టీల మద్దతును ఇప్పుడు టీవీకే స్వీకరించడం లేదా వారిని మంత్రివర్గంలో చేర్చుకోవడం అనేది ప్రజా తీర్పునకు, వారి ఆశయానికి పూర్తిగా వ్యతిరేకం." అయితే అధికార పార్టీ ఆ దిశగా అడుగులు వేయదని తాము ఆశిస్తున్నట్లు పి.షణ్ముగం పేర్కొన్నారు. కానీ ఒక వేళ ఏఐఏడీఎంకే మద్దతు తీసుకోవాలనే నిర్ణయమే తీసుకుంటే, తాము ఇస్తున్న మద్దతును సమీక్షించుకోవడానికి వామపక్ష పార్టీలు సిద్ధంగా ఉంటాయని ఆయన హెచ్చరించారు. ఇక ఏఐఏడీఎంకే అంతర్గత పరిణామాలపై స్పందిస్తూ, ఆ పార్టీలో వర్గ పోరాటాలు కొత్తేమీ కాదని అన్నారు. వాటిని ప్రజల సంక్షేమంతో సంబంధం లేని అంతర్గత విషయాలుగా షణ్ముగం అభివర్ణించారు.

ఇటీవల జరిగిన తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే నేతృత్వంలోని కూటమిలో భాగంగా సీపీఐ(ఎం), సీపీఎంలు పోటీ చేసి, చెరో రెండేసి స్థానాలను గెలుచుకున్నాయి. మరోవైపు విజయ్ టీవీకే పార్టీ 108 స్థానాల్లో జయకేతనం ఎగురవేసి, అతిపెద్ద పార్టీగా నిలిచింది. అయితే మ్యాజిక్ ఫిగర్?కు 10 స్థానాల దూరంలో నిలిచిపోయారు. దీనితో అక్కడ గవర్నర్ పాలన గానీ, మళ్లీ ఎన్నికలు జరిగే అవకాశాలు గానీ ఉన్నాయనే వార్తలు వచ్చాయి. మరోవైపు డీఎంకే, ఏఐఏడీఎంకేలు కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తాయనే రూమర్స్ కూడా వచ్చాయి. అయితే డీఎంకే కూటమి నుంచి అనూహ్యంగా కాంగ్రెస్ బయటకు వచ్చి విజయ్?కు మద్దతు ఇచ్చింది. తర్వాత సీపీఐ(ఎం), వీకేసీ, ఐయూఎంఎల్ తదితర పార్టీలు ఆయను మద్దతు ప్రకటించాయి. దీనితో విజయ్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. ఇక ఫ్లోర్ టెస్ట్ సమయానికి ఏఐఏడీఎంకే నుంచి గెలిచిన కొందరు ఎమ్మెల్యేలు కూడా విజయ్?కు సపోర్ట్ చేయడం గమనార్హం.

**వీసీకే, ఐయూఎంఎల్‌కు ఆహ్వానం**

మరోవైపు రాష్ట్రమంత్రివర్గంలో చేరాలని తమిళనాడు ప్రజా పనులు, క్రీడాభివృద్ధి శాఖ మంత్రి అధవ్? అర్జున బుధవారం వీసీకే, ఐయూఎంఎల్? పార్టీలకు ఆహ్వానం పలికారు. ఎలాగైనా అధికారంలోకి రావాలనే లక్ష్యంతో డీఎంకే, ఏఐఏడీఎంకే పార్టీలు పరస్పరం చేతులు కలిపి, టీవీకే సర్కార్ ఏర్పడకుండా అడ్డుకోవడానికి ప్రయత్నించాయని ఆయన ఆరోపించారు. ముఖ్యమంత్రి విజయ్? తన మంత్రివర్గం ఒకే కుటుంబంలా పనిచేయాలని ఆశిస్తున్నారని, వామపక్ష పార్టీలను కూడా తన మంత్రివర్గంలో చేర్చుకోవడానికి ఆసక్తి చూపిస్తున్నారని అధవ్ అర్జున పరోక్షంగా సూచించారు.

**మంత్రివర్గంలో చేరికపై ఆలోచిస్తాం!**

మరోవైపు రాష్ట్ర మంత్రి వర్గంలో చేరాలంటూ టీవీకే నేత అధవ్? అర్జున ఇచ్చిన ఆహ్వానంపై, వీసీకే అధ్యక్షుడు థోల్? తిరుమావలవన్ తనదైన రీతిలో? స్పందించారు. "మేము టీవీకే ఆహ్వానాన్ని గౌరవిస్తున్నాం. మేము ప్రస్తుతం డీఎంకే కూటమిలోనే ఉన్నాం. అయితే మా పార్టీ ఉన్నత స్థాయి కమిటీ సమావేశం జరిగినప్పుడు, చాలా మంది మంత్రివర్గంలో భాగం కావాలనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. మేము పార్టీ కార్యకర్తలతో కూడా చర్చించి, మా నిర్ణయాన్ని ప్రకటిస్తాం" అని అన్నారు.

# నకిలీ సోషల్ మీడియా అకౌంట్స్‌పై ఉక్కుపాదం

రాబోయే నీట్ పునఃపరీక్షను అత్యంత పారదర్శకంగా, సురక్షితంగా నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం ముమ్మర చర్యలు చేపట్టింది.. దీనిలో భాగంగా మంగళవారం కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్.. కేంద్ర భద్రతా, నిఘా (ఇంటెలిజెన్స్) ఏజెన్సీల ఉన్నత అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. పరీక్షల నిర్వహణలో ఎలాంటి అవకతవకలు జరగకుండా అత్యున్నత స్థాయి నిఘా ఉంచాలని అధికారులను ఆదేశించారు. పరీక్షను సురక్షితంగా, పటిష్ఠంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు అప్రమత్తతను పెంచాలని, పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని ధర్మంద్ర ప్రధాన్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో విద్యా మంత్రిత్వ శాఖ సీనియర్ అధికారులు, జాతీయ పరీక్షల ఏజెన్సీ (ఎన్‌టీఏ) డైరెక్టర్ జనరల్ కూడా పాల్గొన్నారు. ముందుగానే లోపాలను గుర్తించి, సకాలంలో నివారణ, సవరణ చర్యలు తీసుకునేందుకు జరుగుతున్న సన్నాహాలను ఈ సమావేశంలో వివరంగా సమీక్షించారు.

నకిలీ సోషల్ మీడియా నెట్‌వర్క్‌లపై నిఘా

ఈ సమావేశంలో భాగంగా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ప్రముఖ సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లైన మెటా (వీమ్ఞ), గూగుల్ (+శీశీస్త్రశ్రీవ), టెలిగ్రామ్ ప్రతినిధులతో కూడా ప్రత్యేకంగా భేటీ అయ్యారు. పోటీ పరీక్షల సమయంలో టెలిగ్రామ్ ఛానళ్లు, అనామక ఆన్‌లైన్ గ్రూపుల ద్వారా వ్యాపిస్తున్న తప్పుడు సమాచారంపై ఆయన తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.



ప్రధాన పరీక్షలకు ముందు ఇలాంటి అనేక ఛానెళ్లు అత్యంత చురుకుగా మారి, నకిలీ ప్రశ్నపత్రాల లీకేజీ ఆరోపణలు, క్లిక్‌బైట్ కంటెంట్, ధృవీకరించని సమాచారాన్ని వ్యాప్తి చేస్తూ విద్యార్థులు, తల్లిదండ్రులలో భయాందోళనలు, ఆందోళన, గందరగోళాన్ని రేకెత్తిస్తాయని అధికారులు గుర్తించారని తెలిపారు. ఇలాంటి అనేక లింకులు, తప్పుడు సమాచారాన్ని విస్తరింపజేయడానికి రూపొందించిన ఆటోమేటెడ్ బాట్‌లు, నకిలీ గ్రూపులకు వినియోగదారులను మళ్లిస్తున్నాయని వారు స్పష్టం చేశారు.

ఇంటెలిజెన్స్ ఏజెన్సీలు అందించిన సమాచారం ప్రకారం, పరిమిత సంఖ్యలో ఫోన్ నంబర్ల ద్వారా అనేక అనుమానాస్పద ఛానెళ్లు పనిచేస్తున్నాయి. ఇది సమన్వయంతో, వ్యవస్థీకృతంగా జరుగుతున్న కార్యకలాపాలను సూచిస్తోంది.

ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణిస్తూ, శ్రీ ధర్మేంద్ర ప్రధాన్ ఇలాంటి నెట్‌వర్క్‌లపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పరీక్షలకు ముందు తప్పుడు సమాచారం, ప్రచారం, భయాందోళనలను వ్యాప్తి చేసే ఛానెళ్లను ముందుగానే గుర్తించి, బ్లాక్ చేసి, తొలగించాలని ఆయన సూచించారు.

తప్పుడు సమాచారాన్ని వేగంగా అరికట్టడానికి, పరీక్షా వ్యవస్థ సమగ్రతను కాపాడటానికి సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లు విద్యా మంత్రిత్వ శాఖ, ఎన్‌టిఎ, చట్ట అమలు సంస్థలతో సమన్వయంతో పనిచేయాలని మంత్రి నొక్కి చెప్పారు.

తప్పుడు కథనాల నుండి విద్యార్థులను కాపాడటం, పరీక్షా ప్రక్రియపై ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టడం ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యత గల అంశమని ధర్మేంద్ర ప్రధాన్ పునరుద్ఘాటించారు.

## సీఏఏ జూహూ పరిధిలోకి రాని ప్రతి ఒక్కరూ చొరబాటుదారులే

భారత్-బంగ్లాదేశ్ సరిహద్దు వెంబడి కంచె నిర్మాణం కోసం బీఎస్‌ఎఫ్‌కు తొలి విడతగా 27 కిలోమీటర్ల భూమిని బదిలీ చేస్తున్నట్లు బంగాల్ సీఎం సువేందు అధికారి తెలిపారు. సరిహద్దు నిర్వహణను బలోపేతం చేసేందుకు బీఎస్‌ఎఫ్‌నకు ఎక్కడ భూమి అవసరమవుతుందో వాటిని అప్పగించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. బీఎస్‌ఎఫ్ ల్యాండ్ ట్రాన్స్‌ఫర్ మీటింగ్‌లో మాట్లాడిన సువేందు అధికారి గత ప్రభుత్వ ఓటు బ్యాంకు రాజకీయాలు వల్ల భూమి బదిలీ నిలిచిపోయిందని ఆరోపించారు. బంగాల్ రాష్ట్రం బంగ్లాదేశ్‌తో సుమారు 2,200 కిలోమీటర్ల మేర అంతర్జాతీయ సరిహద్దును పంచుకుంటోందని, అందులో 1,600 కిలోమీటర్ల మేర మాత్రమే కంచె నిర్మాణం పూర్తయిందని చెప్పారు. మిగిలిన 600 కిలోమీటర్ల సరిహద్దు ప్రాంతం ఇప్పటికీ ఎలాంటి కంచె లేకుండా అలాగే ఉండిపోయిందన్నారు. జాతీయ భద్రతతో ముడిపడి ఉన్న సరిహద్దు మౌలిక సదుపాయాల కల్పనలో కేంద్రానికి మమతా ప్రభుత్వం సహకారం అందించలేదని మండిపడ్డారు. రాష్ట్రంలోకి అక్రమ వలసలు, చొరబాట్లను నిరోధించేందుకు తమ ప్రభుత్వం సరికొత్త, అత్యంత కఠినమైన విధానాన్ని అమలులోకి తెచ్చిందని ముఖ్యమంత్రి ప్రకటించారు. రాష్ట్ర పోలీసులు పట్టుకునే చొరబాటుదారులను నేరుగా బీఎస్‌ఎఫ్‌కు అప్పగించే నిబంధనను ఇప్పుడు కచ్చితంగా అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ విషయమై గత ఏడాదే కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి లేఖ రాసినప్పటికీ, గత టీఎంసీ ప్రభుత్వం ఈ ముఖ్యమైన నిబంధనను తొక్కేసిందని దుయ్యబట్టారు. పౌరసత్వ సవరణ చట్టం పరిధిలోకి రాని ప్రతి ఒక్కరినీ చొరబాటుదారులుగానే పరిగణిస్తామని, వారిని తిరిగి సొంత దేశాలకు పంపిస్తామని సీఎం సువేందు అధికారి ప్రకటించారు.

## పేదలకు ఉచిత వైద్యం తప్పనిసరి..

ఢిల్లీలో పేదల ఆరోగ్య హక్కును కాపాడటంలో సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీచేసింది..ప్రభుత్వ రాయితీలు, అనుకూల భూములపై నిర్మించిన ప్రైవేట్ ఆసుపత్రులు పేదలకు ఉచిత వైద్య సేవలు అందించాలని సుప్రీం కోర్టు మరోసారి స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. 2018లో



ఇచ్చిన తీర్పును అమలు చేయడంలో విఫలమవుతున్న ఆసుపత్రులపై తీవ్ర అసహనం వ్యక్తం చేసింది..నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.ప్రభుత్వం నుంచి తక్కువ ధరకు భూములు పొందిన ఆసుపత్రులు పేద రోగులకు 10% ఇన్‌పేషెంట్ బెడ్స్ , 25% అవుట్‌పేషెంట్ సేవలు పూర్తిగా ఉచితంగా అందించాలని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. ఇందులో మందులు, పరీక్షలు, శస్త్రచికిత్సలు, హాస్పిటల్ ఛార్జీలు అన్నీ ఉచితంగా ఉండాలని పేర్కొంది.. మురికివాడల సమీపంలో ఆసుపత్రులు నిర్మించుకుని, పేదలకు వైద్యం అందించడంలో వెనకడుగు వేయడం సరికాదని సుప్రీంకోర్టు పేర్కొంది. సామాన్యులకు వైద్యం అందని ద్రాక్ష కావొద్దు అని కోర్టు గట్టిగా చెప్పింది.నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సుప్రీం కోర్టు హెచ్చరిక జారీ చేసింది. ఈ తీర్పు దేశవ్యాప్తంగా ఉన్న వందలాది ప్రైవేట్ ఆసుపత్రులపై తీవ్ర ప్రభావం చూపనుంది.

**ఢిల్లీ ఆసుపత్రుల్లో ఏం జరిగిందంటే ?:**

ఢిల్లీలోని ప్రైవేట్ ఆసుపత్రులలో ఆర్థికంగా బలహీన వర్గాల వారికి ఉచిత చికిత్సను అమలు చేయడానికి ప్రామాణిక కార్యాచరణ విధానం రూపొందించాలని ఢిల్లీ ప్రభుత్వానికి సుప్రీంకోర్టు ఆదేశించింది..గతంలో ధిక్కార నోటీసులు జారీ చేసిన 51 ఆసుపత్రులలో కేవలం 4 మాత్రమే నిబంధనలను పాటిస్తున్నాయని కోర్టు పేర్కొంది.రాయితీతో ప్రభుత్వ భూములపై నిర్మించిన ఢిల్లీలోని ప్రైవేట్ ఆసుపత్రులలో ఆర్థికంగా బలహీన వర్గాల (జుఔ) రోగులకు ఉచిత చికిత్సను అందించాలని ఆదేశించిన తన 2018 తీర్పును సమర్థవంతంగా అమలు చేయడానికి, ఒక ప్రామాణిక కార్యాచరణ విధానం (ూఖ్రా) రూపొందించడం కోసం ప్రభుత్వ అధికారులు, భూ యాజమాన్య సంస్థలు ప్రైవేట్ ఆసుపత్రులతో కూడిన ఉన్నత స్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది.గతంలో ఆదేశాలు జారీ చేసినప్పటికీ, అనేక ఆసుపత్రులు నిబంధనల పాటింపు అఫిడవిట్లను దాఖలు చేయడంలో విఫలమయ్యాయని, బలహీన వర్గాల రోగులకు 10% ఋూణ (ఇన్‌పేషెంట్ డిపార్ట్‌మెంట్ -- ఇక్కడ రోగిని 24 గంటలు లేదా అంతకంటే ఎక్కువ ఆసుపత్రిలో చేర్చుతారు), 25% ూూణ చికిత్సను ఉచితంగా అందించాలనే నిబంధనను ఉల్లంఘించినట్లు జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా జస్టిస్ ఎన్.వి. అంజరియాలతో కూడిన ధర్మాసనం పేర్కొంది.ప్రైవేట్ ఆసుపత్రులు నిబంధనల పాటించడం పై ఒక నివేదికను సిద్ధం చేయడానికి న్యాయస్థానం గతంలో సీనియర్ న్యాయవాది సంజయ్ జైన్ న్యాయవాది నినాద్ లాడ్‌లను అమీసీ క్యూరీలుగా నియమించింది. బలహీన వర్గాల ప్రజలకు (జుఔ) ఉచిత చికిత్స అందించాలన్న న్యాయస్థానం యొక్క 2018 తీర్పును ఉల్లంఘించినందుకు ధిక్కార నోటీసులు జారీ చేయబడిన 51 ఆసుపత్రులతో పాటు, అమికస్ క్యూరీ మే 10, 2026న సుప్రీంకోర్టు కు ఒక నివేదికను సమర్పించారు. ఢిల్లీ అర్బన్ షెల్టర్ ఇంప్రూవ్‌మెంట్ బోర్డ్ , ఱణూా అధీకృత కాలనీల వద్ద మురికివాడలు, బస్తీల వద్ద ఆసుపత్రులలో చికిత్స పొందడానికి వెళ్ళే వారి డేటా ఆధారంగా నివేదిక రూపొందించారు.

**సుప్రీంకోర్టు తీర్పును ఉల్లంఘించిన ఆసుపత్రులు:**

సుప్రీంకోర్టు తీర్పును ఉల్లంఘించినట్లు తేలిన 51 ఆసుపత్రులలో, మాక్స్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, ప్రైమస్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, వెంకటేశ్వర్ హాస్పిటల్, విమ్హాన్స్ హాస్పిటల్ మూల్‌చంద్ హాస్పిటల్ అనే ఆరు ఆసుపత్రులు మినహా, మిగిలినవన్నీ నిబంధనల పాటింపు అఫిడవిట్‌ను దాఖలు చేశాయి. 51 ఆసుపత్రులలో, అమర్ జ్యోతి ఆసుపత్రి, భగవతి ఆసుపత్రి, వేణు ఐ ఇన్‌స్టిట్యూట్, జీవోదయ ఆసుపత్రి అనే నాలుగు ఆసుపత్రులు మాత్రమే కోర్టు తీర్పును పాటించినట్లు తేలింది. అమికస్ క్యూరీ నివేదికను పరిగణనలోకి తీసుకున్న కోర్టు, ఉచిత చికిత్స ఆదేశాన్ని సమర్థవంతంగా అమలు చేయడానికి సమన్వయంతో కూడిన సంస్థాగత చర్య అవసరమని పేర్కొంది..దీనికోసం పలు అధికార వర్గాలు, భాగస్వాములతో ఒక సంయుక్త సమావేశం నిర్వహించాలని ఆదేశించింది.

## అది అసాంఘిక శక్తుల పనే కుట్రపూరితంగానే రైళ్లలో అగ్నిప్రమాదాలు

ఇటీవలి రైళ్లలో జరిగిన అగ్నిప్రమాద ఘటనలపై రైల్వే శాఖ బుధవారం కీలక ప్రకటన విడుదల చేసింది. కుట్రపూరిత విద్రోహ చర్యల కారణంగానే ఆ ప్రమాదాలు జరిగాయని తెలిపింది. పలు ఘటనల్లో అసాంఘిక శక్తుల ప్రమేయం ఉందని దర్యాప్తులో తేలిందని వెల్లడించింది. మే 19న (మంగళవారం) మధ్యాహ్నం దాదాపు 3.45 గంటలకు బంగాల్‌లోని హౌరా స్టేషన్‌లో ఆగి ఉన్న మిథిలా ఎక్స్‌ప్రెస్‌లోని ఒక బోగీలో మంటలు చెలరేగిన విషయాన్ని రైల్వేశాఖ గుర్తుచేసింది. వెంటనే రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (ఆర్‌పీఎఫ్), ఫోరెన్సిక్ టీమ్స్ తనిఖీలు చేపట్టగా, ఆ బోగీలోని టాయిలెట్‌లో పెట్రోలుతో తడిపిన సగం కాలిన గుడ్డ ముక్క లభించిందని తెలిపింది. మొత్తం రైల్వే సిబ్బంది చురుగ్గా స్పందించి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చి పెద్ద ప్రమాదాన్ని నివారించారని రైల్వేశాఖ పేర్కొంది. కొంతమంది అసాంఘిక శక్తులు ప్రయాణికుల భద్రతకు ముప్పు కలిగించడానికి, రైల్వే వ్యవస్థలో భయాందోళనలు, గందరగోళాన్ని సృష్టించడానికి ప్రయత్నిస్తున్నట్లు ప్రాథమిక పరిస్థితులు సూచిస్తున్నాయని రైల్వేశాఖ వెల్లడించింది. ఆర్‌పీఎఫ్, సంబంధిత దర్యాప్తు సంస్థలు ఈ విషయాలన్నింటిపై లోతైన దర్యాప్తు చేస్తున్నాయని చెప్పింది. గత వారం రోజుల వ్యవధిలో రాజస్థాన్‌లోని అమరపుర స్టేషన్ సమీపంలో, మధ్యప్రదేశ్ పరిధిలోని కోట రైల్వే డివిజన్‌లో, బిహార్‌లోని ససారం రైల్వే స్టేషన్‌లో, బంగాల్‌లోని హౌరా స్టేషన్‌లో రైళ్లలో జరిగిన నాలుగు అగ్నిప్రమాద ఘటనలను తాజా ప్రకటనలో రైల్వేశాఖ ప్రస్తావించింది. ఈ సంఘటనలను తాము చాలా తీవ్రంగా పరిగణిస్తున్నామని, ప్రతి ఘటనలోనూ ఆర్‌పీఎఫ్ లోతైన దర్యాప్తును నిర్వహిస్తోందని తెలిపింది. రాజస్థాన్‌లోని అమరపుర స్టేషన్ సమీపంలో రైలుబోగీలోని పరుపు, సామగ్రికి నిప్పు పెట్టినట్లు ఆరోపణలు వచ్చాయని పేర్కొంది. బంగాల్‌లోని హౌరా స్టేషనులో అగ్నిప్రమాదానికి గురైన రైలు బోగీలోని టాయిలెట్ నుంచి పెట్రోలులో తడిపిన వస్త్రాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారని చెప్పింది.

# విద్యారంగ పెట్టుబడులకు ఎఫ్ఆర్బీఎం మినహాయింపు ఇవ్వండి

-మొదటిపేజీ తరువాయి

డిప్యూటీ సీఎం, ఆర్థిక వ్యవహారాల శాఖ ఆమోదిత ప్రాజెక్టులకు ఎఫ్ఆర్బీఎం పరిమితి మినహాయింపు కోరారు.

**కేంద్రానికి కృతజ్ఞతలు**

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో భేటీ అయిన డిప్యూటీ సీఎం, తెలంగాణ అభివృద్ధి, విద్యా రంగంలో భారీ పెట్టుబడులు, మూలధన వ్యయాలకు అదనపు ఆర్థిక సహాయం కోరారు. ఎస్ఏఎస్‌సీఐ కింద రూ.5,000 కోట్ల ప్రత్యేక సహాయం, విద్యారంగ పెట్టుబడులకు ఎఫ్?ఆర్?బీఎం మినహాయింపు ఇవ్వాలని విన్నవించారు. సాస్కీ కింద తెలంగాణకు అదనంగా రూ.5,000 కోట్ల ప్రత్యేక ఆర్థిక సహాయాన్ని మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ పథకం ద్వారా రాష్ట్రాలకు 50 ఏళ్ల వడ్డీ లేని రుణాల రూపంలో అందిస్తున్న సహకారానికి తెలంగాణ ప్రభుత్వం తరపున ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

**సంక్షేమ పథకాలకు మరింత ఆర్థిక మద్దతు**

2025-26 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రానికి ఇప్పటికే రూ.4,208 కోట్లు మంజూరైన విషయాన్ని ప్రస్తావించారు. రాష్ట్రంలో కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలకు మరింత ఆర్థిక మద్దతు అవసరమని కేంద్ర మంత్రికి వివరించారు. నూతనంగా ఏర్పడిన రాష్ట్రాల్లో తెలంగాణ వేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. అయినప్పటికీ 2014 నుంచి 2023 మధ్య ప్రత్యేక ప్రయోజన సంస్థలు (ఎస్?వీపీ) ద్వారా తీసుకున్న అప్పుల భారం, వాటి చెల్లింపుల కారణంగా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై ఒత్తిడి పెరిగిందని ఉప ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు.

**ప్రపంచ స్థాయి విద్య అందించేందుకు**

అయినా విద్య, వైద్యం, గ్రామీణ మౌలిక వసతులు, మానవ వనరుల అభివృద్ధి రంగాల్లో తెలంగాణ ప్రభుత్వం భారీ స్థాయిలో పెట్టుబడులు కొనసాగిస్తోందని ప్రస్తావించారు.



యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ద్వారా రాష్ట్రంలోని విద్యార్థులకు ప్రపంచ స్థాయి విద్య అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉన్నట్లు నిర్మలా సీతారామన్?కి తెలిపారు. జిల్లాల వారీగా కొత్త మెడికల్ కళాశాలలు, గ్రామీణ ఆరోగ్య సేవల విస్తరణ, విద్యా మౌలిక వసతుల బలోపేతం వంటి కార్యక్రమాలు సామాజిక సమానత్వంతో కూడిన సుస్థిర అభివృద్ధికి దోహదపడతాయని కేంద్రమంత్రికి వివరించారు.

**విద్యారంగ రూపాంతరానికి రూ.30,000 కోట్లు**

రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగ రూపాంతరానికి మొత్తం రూ.30,000 కోట్ల పెట్టుబడుల ప్రణాళిక రూపొందించిందని ప్రస్తావించారు. ఇందులో రూ.21,000 కోట్లతో 105 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ క్యాంపస్‌ల నిర్మాణం, మరో రూ.9,000 కోట్లతో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, డిగ్రీ కళాశాలలు, సాంకేతిక విద్యాసంస్థలు, డిజిటల్ మౌలిక వసతుల అభివృద్ధి చేపడుతున్నట్లు ఆయన వివరించారు. ప్రాజెక్టులపై సింగరేణి ఆసక్తి : కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డితో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క భేటీ అయ్యారు. బొగ్గు గ్యాసిఫికేషన్ దిశగా సింగరేణి ముందడుగుకు కేంద్ర సహకారం కోరారు. కోల్ ఇండియా తరహాలో గ్యాసిఫికేషన్ ప్రాజెక్టులపై సింగరేణి ఆసక్తి చూపుతోందని తెలిపారు. గ్యాసిఫికేషన్ ప్రాజెక్టులపై సింగరేణి ఆసక్తి చూపుతోందని కిషన్‌రెడ్డికి భట్టి తెలిపారు. కొయ్యగూడెం బ్లాక్-3 కేటాయింపు, తాడిచెర్ల కోల్ బ్లాక్-2 మైనింగ్ లీజ్ అంశాలపై చర్చించారు.

# అంతర్జాతీయ స్థాయి సంస్థలు ఫ్యూచర్‌సిటీకి

-మొదటిపేజీ తరువాయి

ముఖ్యమంత్రి ఆదేశించారు. హైదరాబాద్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో ఫ్యూచర్ సిటీలో భూముల కేటాయింపు, పరిశ్రమల ఏర్పాటుపై మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. నెట్ జీరో సిటీ తరహాలో డిజైన్లు ఉండాలని రాజీపడవద్దని సీఎం స్పష్టం చేశారు. అంతర్జాతీయ స్థాయి నగరాలను అధ్యయనం చేయాలని అధికారులకు సూచించారు. భారత్ ఫ్యూచర్ సిటీలో అంతర్జాతీయ స్థాయిలో మౌలిక వసతులు కల్పించాలని ఆదేశించారు. మౌలిక సదుపాయాలు కల్పించిన తర్వాతే భూములు కేటాయించాలని వెల్లడించారు. అంతర్జాతీయస్థాయి సంస్థలను ఫ్యూచర్ సిటీకి తీసుకురావాలని చెప్పారు. ఫ్యూచర్ సిటీలో ప్రజా ప్రతినిధులు, సివిల్ సర్వీసెస్ అధికారులు, జర్నలిస్టులకు 500 ఎకరాలు కేటాయించనున్నట్లు సీఎం ప్రకటించారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన హెల్త్ క్లస్టర్ ఫ్యూచర్ సిటీ వచ్చేలా చర్యలు తీసుకోవాలని, అవసరమైతే ప్రధాని నరేంద్ర మోదీని కలిసి కోరుతామని తెలిపారు.

**ప్రత్యేక కార్యాలయం ఏర్పాటు చేయాలి**

జూన్‌లో ఫ్యూచర్ సిటీ ఇండ్రస్టియల్ పార్క్‌లో పరిశ్రమలకు శంకుస్థాపన జరిగేలా చూడాలని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. భూములు కేటాయించిన వెంటనే నిర్మాణాలు మొదలు పెట్టాలనే నిబంధన విధించాలని తెలిపారు. పెట్టుబడుల ఆకర్షణ కోసం ఇన్వెస్ట్ తెలంగాణ పేరుతో ప్రత్యేక విభాగం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఇందుకోసం ఆకర్షణీయమైన లోగో, వెబ్ సైట్, ప్రత్యేక కార్యాలయం ఏర్పాటు చేయాలని సీఎం చెప్పారు.

**1500 ఎకరాల్లో డేటా సిటీ ఏర్పాటు**

తెలంగాణ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టే వారి కోసం ఎస్కార్ట్ ఆఫీసర్ వ్యవస్థని రూపొందించాలన్న రేవంత్ రెడ్డి గ్రూప్-1 స్థాయి అధికారిని ఎస్కార్ట్ ఆఫీసర్‌గా నియమించే అంశాన్ని పరిశీలించాలని తెలిపారు. తమిళనాడు, గుజరాత్ పారిశ్రామిక విధానాన్ని అధ్యయనం చేయాలని అధికారులకు చెప్పారు. బుల్లెట్ ట్రైన్ కోసం భూ సేకరణ ప్రారంభించాలని ఆదేశించారు. ఫ్యూచర్ సిటీలో 1500 ఎకరాల్లో డేటా సిటీ ఏర్పాటు చేయాలని, నీటి అవసరాల కోసం ఎస్‌టీపీలను వినియోగించాలని సూచించారు. జీసీసీలు, డేటా సెంటర్ల కోసం కరీంనగర్, వరంగల్, విజయవాడ రహదారుల సమీపంలోని ప్రభుత్వ భూములు గుర్తించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ద్వితీయ శ్రేణి నగరాల్లో గ్లోబల్ కెపబిలిటీ సెంటర్ల ఏర్పాటు కోసం పాలసీ రూపొందించాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాలన్నీ 3 నెలల్లో టీ-ఫైబర్‌కు కనెక్ట్ కావాల్సిందేనని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

## హైదరాబాద్ మెట్రో రైలు విస్తరణ

హైదరాబాద్ మెట్రో రైల్ విస్తరణకు ముందడుగు పడింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరో 50 శాతం చొప్పున ఖర్చు చేసే ప్రాతిపదికన ముందుకెళ్లేందుకు సిద్ధంగా ఉన్నామని కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ ప్రకటించారు. మూసీ ప్రక్షాళనకు కేంద్రం సహకరిస్తుందని, అమృత్ 2.౦ పథకం కింద రూ.3 వేల 975 కోట్లతో 39 ఎస్‌టీపీలు మంజూరు చేసినట్లు వెల్లడించారు. ఢిల్లీలో జరిగిన సమావేశంలో హైదరాబాద్‌లో ప్రజా రవాణా, పారిశుద్ధ్యం, మౌలిక వసతుల ప్రాజెక్టులపై సమీక్షించినట్లు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు.

**కేంద్ర ప్రభుత్వానికి ఎటువంటి ఇబ్బంది లేదు**

హైదరాబాద్ మెట్రో రైల్ విస్తరణ, పారిశుద్ధ్యం, మౌలిక సదుపాయాలపై ఢిల్లీలో కేంద్రమంత్రులు మనోహర్‌లాల్ ఖట్టర్, కిషన్‌రెడ్డి సమీక్షించారు. సమావేశ వివరాలను కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సామాజిక మాధ్యమం ఎక్స్ ద్వారా వెల్లడించారు. హైదరాబాద్ మెట్రో రెండో దశ ప్రాజెక్టుపై సమావేశంలో చర్చించినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఎల్? అండ్ టీ సంస్థ నుంచి మెట్రో రైల్‌ను ఇటీవలే టేకోవర్ చేసుకుంది. ఈ నేపథ్యంలో రెండో దశ పనులకు సంబంధించిన డీటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్? (డీపీఆర్), ఇతర సాంకేతిక వివరాలు అందిన తర్వాత కేంద్ర ప్రభుత్వం సమగ్రంగా పరిశీలించి తదుపరి నిర్ణయం తీసుకుంటుందని కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్ తెలిపారు. హైదరాబాద్ మెట్రో రెండో దశ ప్రాజెక్టు చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వానికి ఎటువంటి ఇబ్బంది లేదని స్పష్టం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరో 50 శాతం చొప్పున ఖర్చు చేసే ప్రాతిపదికన ముందుకెళ్లేందుకు సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే 162 కిలోమీటర్ల మేర మెట్రో రెండో దశ విస్తరణకు ప్రతిపాదనలు సమర్పించిందని, సానుకూలంగా పరిశీలించి తదుపరి చర్యలు తీసుకుంటామని మనోహర్‌లాల్ ఖట్టర్ వెల్లడించారు.

**కేంద్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో సహకారం**

హైదరాబాద్‌లో మూసీ ప్రక్షాళనపైనా సమావేశంలో చర్చించారు. అమృత్ 2.౦ పథకంలో భాగంగా మూసీ నదిలో కలుస్తున్న మురుగు నీటిని శుద్ధి చేసేందుకు మొత్తం 39 సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లను (ఎస్‌టీపీ)లను మంజూరు చేశామని, ఈ ప్రాజెక్టు కోసం రూ.3 వేల 975 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు ఖట్టర్ చెప్పారు. 39 ఎస్?టీపీల ద్వారా రోజుకు 972 మిలియన్ లీటర్ల మురుగు నీటిని శుద్ధి చేసే సామర్థ్యం వస్తుందన్నారు. శుద్ధి చేయని మురికి నీరు నేరుగా మూసీ నదిలో కలవకుండా ఎస్?టీపీలతో నిరోధించవచ్చన్నారు. మూసీ నది పరిరక్షణతో పాటు నగర పారిశుద్ధ్య మెరుగుదలకు ఇది ఎంతో దోహదం చేస్తుందని ఖట్టర్ తెలిపారు. హైదరాబాద్ మహానగర అభివృద్ధికి, ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం పూర్తి స్థాయిలో సహకారం అందిస్తుందని అన్నారు. హైదరాబాద్ ప్రజల తరపున కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఖట్టర్‌కు కృతజ్ఞతలు తెలిపినట్లు కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

# జలమండలిలో అవినీతి జలగలు!

-మొదటిపేజీ తరువాయి

మార్చింది. ఈ ఘటనతో జలమండలిలో సంవత్సరాలుగా కొనసాగుతున్న అవినీతి వ్యవస్థపై మరోసారి చర్చ మొదలైంది.

**కుర్చీ వదలరు**

జల మండలిలో నిర్మాణాలు, అభివృద్ధి పనులన్నింటినీ పర్యవేక్షించే ప్రత్యేక ప్రాజెక్టుల విభాగం ఉంది. ఈ విభాగంలో ఒకసారి పోస్టింగ్ వచ్చిన అధికారులు పదవీ విరమణ వరకు అక్కడే కొనసాగడం సాధారణంగా మారిందని ఉద్యోగ వర్గాలు చెబుతున్నాయి. మేనేజర్‌గా చేరిన అధికారులు ఉన్నత పదవులకు ఎదిగినా, అదే విభాగంలో కొనసాగుతుండటం అనుమానాలకు తావిస్తోంది. ఒకేచోట చాలా కాలం పని చేయడం వల్ల వ్యవస్థలో పారదర్శకత తగ్గి, అవినీతికి అవకాశాలు పెరుగుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి.

**ప్రాజెక్టుల్లో అంచనాల పెంపు ఆరోపణలు**

జలమండలిలో ప్రతి సంవత్సరం రూ.వందల కోట్ల విలువైన నిర్మాణాలు, అభివృద్ధి పనులు జరుగుతుంటాయి. ఈ పనుల్లో అంచనాలను కృత్రిమంగా పెంచడం, అత్యవసర పనుల పేరిట ఒకే పనులను పలుమార్లు చూపించడం, పనులు చేయకుండానే బిల్లులు చెల్లించడం వంటి ఆరోపణలు చాలా కాలంగా వినిపిస్తున్నాయి. భారీ ప్రాజెక్టుల్లో పనుల నాణ్యత కంటే కాంట్రాక్టుల విలువపై ఎక్కువ దృష్టి పెడుతున్నారనే విమర్శలు కూడా ఉన్నాయి. ఫలితంగా ప్రజా ధనం దుర్వినియోగమవుతోందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

**ఎస్టీపీ నిర్మాణాల్లో ప్రశ్నలు**

హైదరాబాద్ నగరంలో ప్రస్తుతం మురుగు నీటి శుద్ధి




కేంద్రాలైన ఎస్టీపీల నిర్మాణం విస్తృతంగా కొనసాగుతోంది. ఈ పనులను పర్యవేక్షించే బాధ్యత ప్రాజెక్టుల విభాగంపై ఉంది. ఇటీవల ఏసీబీకి చిక్కిన జీఎం కుమార్ కూడా అనేక ఎస్టీపీ పనులను పర్యవేక్షించినట్లు సమాచారం. దీంతో ఈ నిర్మాణాల నిర్వహణ, ఖర్చుల అంచనాలు, కాంట్రాక్టుల కేటాయింపులపై కూడా సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

**ఓఅండ్ఎం విభాగంలోనూ అవినీతి ఆరోపణలు**

ఆపరేషన్స్ అండ్ మెయింటెనెన్స్ విభాగంలో కూడా అవినీతి ఆరోపణలు తీవ్రంగా వినిపిస్తున్నాయి. ఇంటి నీటి కనెక్షన్ల నుంచి కమర్షియల్ కనెక్షన్ల వరకు డబ్బులు చెల్లించకపోతే పనులు ముందుకు కదలవని బాధితులు ఆరోపిస్తున్నారు. అపార్ట్‌మెంట్లు, వాణిజ్య సముదాయాలకు అవసరమైన ఫీజుబిలిటీ ధ్రువపత్రాల కోసం భారీ మొత్తాలు వసూలు చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. డబ్బులు చెల్లించని దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచుతున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి.

**పారదర్శకతపై పెరుగుతున్న ప్రశ్నలు :** జలమండలి వంటి ప్రజలకు అత్యవసర సేవలు అందించే సంస్థలో అవినీతి ఆరోపణలు రావడం ఆందోళన కలిగిస్తోంది. నీటి సరఫరా వ్యవస్థపై ప్రజల నమ్మకాన్ని నిలబెట్టాలంటే పారదర్శకత, అధికారుల బదిలీ విధానంలో మార్పులు, కఠిన పర్యవేక్షణ అవసరమని పలువురు అభిప్రాయపడుతున్నారు. తాజా ఏసీబీ దాడులతో మరిన్ని అక్రమాలు వెలుగులోకి వస్తాయా అనే ఆసక్తి అందరిలోనూ నెలకొంది.

# అమెరికాలో కిలో మామిడి రూ.1900

**హైదరాబాద్ :** మధ్య ఆసియా ప్రాంతంలో యుద్ధం కారణంగా భారత్ పై ప్రభావం పడుతోంది. ఈ తరుణంలో డాలర్ తో పోలిస్తే రూపాయి విలువ పడిపోతుంది. దీంతో అమెరికాలోని కొన్ని వస్తువుల సేవలు భారతీయులకు ప్రియంగా మారాయి. కానీ ఈ సమయంలో భారత జాతీయ పండు అమెరికాలో సంచనలం సృష్టిస్తోంది. అక్కడివారు మామిడి పండ్లకు పడిపోయి ఎగబడి కొంటున్నారు. దీంతో భారత్ లోని మామిడి పండ్లు అమెరికాలో కిలో రూ. 1900 తో విక్రయిస్తున్నారు. హైదరాబాద్ లో కిలో మామిడికి రూ. 100 నుంచి రూ.200 ఉండగా.. అమెరికాలో డిమాండ్ ఎందుకు పెరిగింది? పూర్తి వివరాలు మీకోసం..భారతీయుల భావోద్వేగాలతో ముడిపడి ఉన్న మామిడి పండ్లు ఇప్పుడు అమెరికా మార్కెట్‌లో కొత్త చరిత్ర సృష్టిస్తున్నాయి. ఒకప్పుడు అమెరికాలోని కొన్ని భారతీయ కిరాణా దుకాణాల్లో మాత్రమే కనిపించిన భారత మామిడిపండ్లు, ఇప్పుడు ప్రపంచ ప్రఖ్యాత రిటైల్ చైన్ స్టోర్లలో కూడా అందుబాటులోకి రావడం విశేషం. ముఖ్యంగా అమెరికాలో అతిపెద్ద హోల్‌సేల్ రిటైల్ సంస్థలలో ఒకటైన కాస్ట్కొ స్టోర్లలో భారత మామిడిపండ్లు విక్రయించడం భారత వ్యవసాయ రంగానికి పెద్ద గుర్తింపుగా భావిస్తున్నారు.అమెరికా మార్కెట్‌లో భారత మామిడిపండ్లకు పెరుగుతున్న డిమాండ్ చూస్తే ఆశ్చర్యం కలగక మానదు. ముఖ్యంగా గుజరాత్‌కు చెందిన ప్రసిద్ధ కేసర్ మామిడిపండ్లు అక్కడ భారీ ధరలకు అమ్ముడవుతున్నాయి. కాస్ట్కో వెబ్‌సైట్‌లో ఒక కిలో కేసర్ మామిడి ధర సుమారు 20 డాలర్లుగా నమోదైంది. అంటే భారత కరెన్సీ ప్రకారం దాదాపు రూ.1,900కు పైగా అవుతుంది. భారత్‌లో సాధారణంగా రూ. 100 నుంచి రూ. 200 వరకు అందుబాటులో ఉండే మామిడి పండ్లు విదేశాల్లో విలాసవంతమైన ఫలాలుగా మారిపోవడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.ఈ విజయానికి వెనుక భారత దౌత్యపరమైన ప్రయత్నాలు కూడా కీలక పాత్ర పోషించాయి. అమెరికాలోని సియాటిల్‌లో భారత కాన్సుల్ జనరల్‌గా పనిచేస్తున్న ప్రకాష్ గుప్తా భారత మామిడిపండ్లను ప్రధాన అమెరికన్ రిటైల్ మార్కెట్లలో ప్రవేశపెట్టేందుకు ప్రత్యేక కృషి చేసినట్లు వెల్లడించారు. ఆయన దీనిని 'మామిడి దౌత్యం'గా అభివర్ణించడం ఆసక్తికరంగా మారింది. భారతీయ ఉత్పత్తులకు అమెరికన్వినియోగదారుల్లో విశ్వాసం పెంచేందుకు ఏడాది కాలంగా నిరంతర ప్రయత్నాలు చేసినట్లు తెలిపారు.భారత్ ప్రపంచంలోనే అతిపెద్ద మామిడి ఉత్పత్తిదారుగా కొనసాగుతోంది. ప్రపంచ మొత్తం మామిడి ఉత్పత్తిలో దాదాపు 45 నుంచి 50 శాతం వరకు భారత్ నుంచే వస్తుందని వ్యవసాయ నిపుణులు చెబుతున్నారు. మహారాష్ట్రలో పండే అల్ఫోన్సో, గుజరాత్



కేసర్, ఆంధ్రప్రదేశ్ బంగినపల్లి, ఉత్తరప్రదేశ్ దసరి, లంగ్రా వంటి రకాల మామిడిపండ్లు అంతర్జాతీయ మార్కెట్లో ప్రత్యేక గుర్తింపు సంపాదించాయి. రుచి, సువాసన, తీపి కారణంగా భారత మామిడి పండ్లకు విదేశాల్లో భారీ ఆదరణ లభిస్తోంది.అమెరికాకు మామిడిపండ్ల ఎగుమతి అంత సులభమైన ప్రక్రియ కాదు. అక్కడి ఆహార భద్రతా ప్రమాణాలు చాలా కఠినంగా ఉంటాయి. పండ్లను ప్రత్యేక హాట్ వాటర్ ట్రీట్‌మెంట్, రేడియేషన్ ప్రాసెసింగ్ వంటి విధానాల ద్వారా శుద్ధి చేసిన తర్వాతే ఎగుమతికి అనుమతి ఇస్తారు. అలాగే పండ్లు చెడిపోకుండా కోల్డ్ చైన్ వ్యవస్థ ద్వారా వేగంగా రవాణా చేయాల్సి ఉంటుంది. ఈ మొత్తం ప్రక్రియ ఖర్చుతో కూడుకున్నదే అయినా, పెరుగుతున్న డిమాండ్ కారణంగా ఎగుమతిదారులు ముందుకు వస్తున్నారు.


# శ్రీ లక్ష్మి నరసింహ స్వామి గోశాలకు ఏండుగడ్డి విరాళం




**ఇబ్రహీంపట్నం మాజీ పట్వారి జై శ్రీరామ్ రెడ్డి. గోశాలకు ప్రతీ ఆరు నెలలకు ఎండుగడ్డి విరాళంగా ఇవ్వడం అభినందనీయం**

**ఇబ్రహీంపట్నం,20(తెలంగాణ గీతం )** గోమాత సంరక్షణ భారతీయ సంస్కృతిలో అత్యంత పవిత్రమైన సేవని, గోసంరక్షణ ఉద్యమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఇబ్రహీంపట్నం మాజీ పట్వారి జై శ్రీరామ్ రెడ్డి కోరారు.జై శ్రీ రామ్ రెడ్డి ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం శ్రీ లక్ష్మి నరసింహ స్వామి గోశాలకు 120కట్టల ఎండు గండి (పదిహేను వేల రూపాయల)ఎండుగడ్డిని విరాళంగా గుడి కమిటీ సభ్యులకు అందజేశారు.ఈ సందర్భంగా జై శ్రీ రామ్ రెడ్డి మాట్లాడుతూ...మా యొక్క వ్యసాయ క్షేత్రంలో ప్రతీ ఆరు నెలలకోసారి పండిన పంట నుండి వచ్చే ఎండు గడ్డిని నుంచి ఎండుగడ్డిని ఇబ్రహీంపట్నంలోని శ్రీ లక్ష్మి నరసింహ స్వామి గోశాలకు విరాళంగా అందజేయడం అభినందనీయమన్నారు. గోవుల పరిరక్షణ, పాడి ఉత్పత్తుల పెంపు కోసం సేవా కార్యక్రమాలు చేపట్టడం సమాజానికి ఆదర్శమన్నారు.ప్రతీ ఒక్కరు ఇక్కడ కొలువైన శ్రీ లక్ష్మి నరసింహ స్వామి దేవస్థానంలో ఉన్న స్వామి వారి దర్శనం చేసుకుంటే కోరిన కోరికలు తీరుస్తాడని, అంతే కాకుండా యాదాద్రిలో కొలువైన శ్రీ లక్ష్మి నరసింహ స్వామి తరువాత ఇక్కడ వెలసిన ఇబ్రహీంపట్నం శ్రీ లక్ష్మి నరసింహ స్వామి దేవస్థానంకు ప్రత్యేకత ఉందని జై శ్రీ రామ్ రెడ్డి తెలిపారు.

# క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలన చేయాలి



**రంగారెడ్డి జిల్లా, (తెలంగాణ గీతం)** ఎలాంటి తప్పులు లేని, అత్యంత పారదర్శకమైన ఓటర్ల జాబితాను రూపొందించడమే జిల్లా యంత్రాంగం మరియు రాజకీయ పార్టీల ముఖ్య లక్ష్యం కావాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి తెలిపారు. బుధవారం ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణపై జిల్లా స్థాయి రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ చాంబర్ లో జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం జిల్లా యంత్రాంగం అత్యంత పారదర్శకంగా, ఖచ్చితమైన విచారణతో బాధ్యతాయుతంగా పని చేస్తుందని స్పష్టం చేశారు. రాజకీయ నాయకులు సైతం క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలన చేయాలని కలెక్టర్ సూచించారు. ఇందుకోసం ప్రతి రాజకీయ పార్టీ తక్షణమే తమ బూత్ స్థాయి ఏజెంట్లను నియమించుకోవాలని కోరారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించి, ప్రజాస్వామ్య బలోపేతంలో భాగస్వాములు కావాలని, అధికారులతో రాజకీయ నాయకులు నిరంతరం సమన్వయం చేసుకోవాలని సూచించారు. జూన్ 15 నుండి బూత్ స్థాయి అధికారులకు పూర్తిస్థాయి శిక్షణ, బిఎల్ఓలచే ఇంటింటి సమగ్ర విచారణ చేయడం జరుగుతుందని తెలిపారు.

**బీఎల్ఓల పాత్ర అత్యంత కీలకం**

కొత్త ఓటర్ల నమోదు, జాబితా ప్రక్షాళనలో బూత్ స్థాయి అధికారుల పాత్ర అత్యంత కీలకమని కలెక్టర్ పేర్కొన్నారు. బీఎల్ఓలు ప్రతి ఇంటికీ వెళ్లి క్షుణ్ణంగా విచారణ చేసిన అనంతరం మాత్రమే కొత్త ఓటరు నమోదు ప్రక్రియ చేపడతారని, స్థానికంగా చనిపోయిన వారి పేర్లను తొలగించడం, వలస వెళ్లిన వారిని గుర్తించడంతో పాటు అర్హులైన కొత్త ఓటరు ఎవరూ కూడా జాబితాలో చేర్చే బాధ్యత బీఎల్ఓలపై ఉందని కలెక్టర్ స్పష్టం చేశారు. 1-10-2026 నాటికి 18 సంవత్సరాల వయస్సు నిండే ప్రతి యువతీ, యువకుడు తప్పనిసరిగా ఫామ్-6 ద్వారా కొత్త ఓటరుగా పేరు నమోదు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. అలాగే ఓటర్ల జాబితాలో తప్పుల సవరణలు, మార్పులు, చేర్పుల కోసం ఫామ్-8 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఒక దృఢమైన ప్రజాస్వామ్య నిర్మాణానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఓటు నమోదు ప్రక్రియలో సహకరించాలని కోరారు.

1. తెలంగాణ రాష్ట్రంలో రాబోయే 'ప్రత్యేక సమగ్ర సవరణ' (స్పెషల్ ఇంటెన్సివ్ రెవిషన్ - సార్ ) ప్రక్రియ.
2. 'బూత్ స్థాయి ఏజెంట్ల' (బూత్ లెవెల్ ఏజెంట్స్ - బ్లైస్ ) నియామకం.

గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు ఈ క్రింది వ్యాఖ్యలు, సూచనలు మరియు విజ్ఞప్తులను చేశారు:

బహుళ అంతస్తుల మరియు ఎత్తైన భవనాల్లో నివసించే ఓటర్లకు ప్రస్తుతం వారి నివాసాలకు దూరంగా ఉన్న వేర్వేరు పోలింగ్ కేంద్రాలను కేటాయించినందున, అటువంటి భవనాల్లోనే కొత్త పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరారు.

రాబోయే జీహెచ్ఎంసి ఎన్నికల దృష్ట్యా, ఓటర్ల జాబితా నుండి నకిలీ నమోదులను తొలగించాలని మరియు మరణించిన ఓటర్ల పేర్లను తొలగించాలని కోరారు.

సంబంధిత 'ఎన్నికల నమోదు అధికారులకు' (ఈరోస్ ) ఆదేశాలు జారీ చేసి, 'బూత్ స్థాయి అధికారుల' (బ్లోస్ ) ఖాళీలు ఏర్పడిన వెంటనే వాటిని తక్షణమే భర్తీ చేసేలా చూడాలని కోరారు.

ఒకే ఇంటి నంబరు కింద 50 మందికి పైగా ఓటర్లు ఉన్న గృహాలను గుర్తించి, భారత ఎన్నికల సంఘం (ఏసిఐ) మార్గదర్శకాల ప్రకారం ఆ కేసులను పరిశీలించి, అవసరమైన దిద్దుబాటు చర్యలు తీసుకునేలా సంబంధిత ఈఆర్ఓలకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు.

ఏస్ఐ-2002 ఓటర్ల జాబితా నకళ్లను అన్ని రాజకీయ పార్టీలకు అందజేయాలని కోరారు.

ప్రక్రియ ప్రారంభానికి ముందే, రాజకీయ పార్టీల భాగస్వామ్యంతో బిఎల్ఓల పర్యవేక్షకులు మరియు బ్లాక్ లకు సరైన శిక్షణ నిర్వహించాలని కోరారు.

ఓటర్ల గణన పత్రాలను (ఏనుమేరేషన్ ఫార్మ్స్ ) ఏదేని అనధికార వ్యక్తికి గుంపుగా కాకుండా, కుటుంబ సభ్యులకు వ్యక్తిగతంగానే పంపిణీ చేయాలని ఈఆర్ఓ లందరికీ ఆదేశాలు ఇవ్వాలని కోరారు.

ఓటర్ల గణన పత్రాల డేటా ఎంట్రీ (దత్తాంశ నమోదు) సమయంలో, నిర్దేశిత విధానాన్ని కచ్చితంగా పాటించాలని సూచించారు.

డేటా ఎంట్రీ ప్రక్రియలో ఎటువంటి లోపాలు లేకుండా, పారదర్శకత మరియు కచ్చితత్వాన్ని పాటించేలా చూడాలని కోరారు. జీహెచ్ఎంసి.పరిధిలోకి వచ్చే పోలింగ్ కేంద్రాల వివరాలను నియోజకవర్గాల వారీగా అందజేయాలని కోరారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు చేసిన సూచనలు మరియు విజ్ఞప్తులను, ఏసీఐ మార్గదర్శకాలకు అనుగుణంగా పరిశీలిస్తామని రంగారెడ్డి జిల్లా ఎన్నికల అధికారి మరియు కలెక్టర్ హామీ ఇచ్చారు. ఆ వివరాలు ఈ క్రింది విధంగా ఉన్నాయి:మార్గదర్శకాల ప్రకారం, ఓటర్ల జాబితా నుండి నకిలీ మరియు మరణించిన ఓటర్ల పేర్లను తొలగించడానికి చర్యలు తీసుకుంటున్నాము; ఓటర్ల జాబితా శుద్ధీకరణ నిమిత్తం ఈఆర్ఓ లందరికీ తదనుగుణంగా ఆదేశాలు జారీ చేయబడతాయి. బహుళ అంతస్తుల మరియు ఎత్తైన భవనాలలో, సాధ్యమైన చోటల్లా కొత్త పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడానికి తగిన చర్యలు తీసుకునేలా, సంబంధిత లందరికీ అవసరమైన ఆదేశాలు జారీ చేయబడతాయని హామీ ఇవ్వబడింది. ఒకే ఇంటి నంబరు కింద 50 మందికి పైగా ఓటర్లు నమోదైన సందర్భాలను గుర్తించి, తగిన విచారణ అనంతరం ఈఐసి మార్గదర్శకాల ప్రకారం సముచిత చర్యలు తీసుకునేలా, సంబంధిత లందరికీ అవసరమైన ఆదేశాలు జారీ చేయబడతాయని హామీ ఇవ్వబడింది. తెలంగాణ సీఈఓ ఆదేశాల మేరకు, రాబోయే వారంలో బ్లాక్ లు మరియు బిఎల్ఓ పర్యవేక్షకులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించబడుతుందని రాజకీయ పార్టీల ప్రతినిధులందరికీ తెలియజేయబడింది. తెలంగాణ, రంగారెడ్డి జిల్లాలో జరగబోయే (సంక్షిప్త సవరణ కార్యక్రమం), ఎన్నికల సంఘం (ఈసీ ) జారీ చేసిన షెడ్యూల్ మరియు మార్గదర్శకాలకు కట్టుబడి కచ్చితంగా నిర్వహించబడుతుందని డియో మరియు కలెక్టర్ హామీ ఇచ్చారు. జీహెచ్ఎంసి పరిధిలోకి వచ్చే పోలింగ్ కేంద్రాల నియోజకవర్గాల వారీ వివరాలు, అలాగే పోలింగ్ కేంద్రాల వారీగా బిఎల్ఓ పర్యవేక్షకుల వివరాలను సంబంధిత అధికారుల నుండి సేకరించిన అనంతరం, రాజకీయ పార్టీలతో పంచుకోవడం జరుగుతుందని రాజకీయ పార్టీల ప్రతినిధులందరికీ తెలియజేశామని తెలిపారు.

ఈ సమావేశంలో రెవెన్యూ అధికారి శారద, ఆర్డీఓలు అనంత్ రెడ్డి, జగదీశ్వర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, సరిత, ఎలక్షన్ సిబ్బంది, మర్రి శశిధర్ రెడ్డి, (బీజేపీ), అంబోజీశ్రీనివాస్, (బిజెపి), కొప్పుల నర్సింహా రెడ్డి, (బీజేపీ), వానిపల్లి శ్రీనివాస్ రెడ్డి, (బీజేపీ), తులసిముఖేష్ ముదిరాజ్, (బిజెపి),సరికొండ దుర్గేష్ బిఆర్ఏస్, యాదయ్య,బిఆర్ఏస్, వి.నవీన్ కుమార్,బిఆర్ఏస్, పి.ధర్మ రెడ్డి,బిఆర్ఏస్ పాల్గొన్నారు.

## నేడే సరస్వతీ అంత్య పుష్కరాల ప్రారంభం

**కంచి స్వామీ శ్రీ విజయేంద్ర సరస్వతీ, రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా లచే తొలి పుష్కర స్నానం**

**హైదరాబాద్ :** కాళేశ్వరం వద్ద జరిగే సరస్వతీ అంత్య పుష్కరాలకు రాష్ట్ర ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లను చేసింది. పుష్కర స్నానాలు మే 21 వ తేదీ నుండి 12 రోజుల పాటు (జూన్ 1 వరకు) జరగనున్నాయి. ఈ పుష్కరాలకు 30 నుండి 40 లక్షల మంది భక్తులు హాజరయ్యే అవకాశం ఉన్నందున, వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం భారీ ఎత్తున ఏర్పాట్లు చేసింది. గత సంవత్సరం జరిగిన సరస్వతీ ఆది పుష్కరాల సందర్భంగా జరిగిన అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ఈ అంత్య పుష్కరాలకు ఏవిధమైన ఇబ్బందులు తలెత్తకుండా అధికార యంత్రాంగం పకడ్బందీ చర్యలను చేపట్టింది. ప్రస్తుత వేసవి తీవ్రతను దృష్టిలో పెట్టుకుని పుష్కర ఘాట్ వద్ద కాయర్ మ్యాట్లు, చలువ పందిళ్లు, ఓ. ఆర్.ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచారు. అధిక సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున పుష్కర ఘాట్ పరిసరాల్లోని 23 ప్రాంతాల్లో వాహనాల పార్కింగ్, బీ.టి రోడ్ల నిర్మాణాన్ని చేపట్టారు. ఈ పుష్కరాల పనుల కోసం ప్రభుత్వం రూ. 30.63 కోట్ల నిధులను కేటాయించింది.

## ఎండ తీవ్రత నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలి

**కలెక్టర్లకు దిశానిర్దేశం చేయాలని సీఎస్‌కు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు**

**హైదరాబద్:** తీవ్రమైన వడ గాలులు, ఎండ తీవ్రతపై వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సూచించారు. ఉత్తర తెలంగాణ జిల్లాల్లో ఎండ తీవ్రత ఎక్కువగా ఉండనున్నందున ఆయా జిల్లాల అధికారులు అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు తగిన సంఖ్యలో అందుబాటులో ఉంచాలని, తాగు నీరు, విద్యుత్ సరఫరాపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సీఎం ఆదేశించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు మొదలు జిల్లా ఆసుపత్రుల వరకు వైద్యారోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, వడదెబ్బతో ఎవరైనా ఆసుపత్రుల్లో చేరితే తగిన వైద్య సహాయం అందించాలని సీఎం ఆదేశించారు. పట్టణ ప్రాంతాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని సీఎం సూచించారు. సాధ్యమైనంత వరకు మధ్యాహ్నం ప్రయాణాలు చేయకుండా ఉండాలని సీఎం సూచించారు. ఆయా జిల్లాల్లో పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ కలెక్టర్లకు దిశానిర్దేశం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావును సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు..!

## సెంట్రింగ్ కార్మికుల నిరవధిక సమ్మె



**ఎల్బీనగర్, మే 20/ తెలంగాణ గీతం** సెంట్రింగ్ కాంట్రాక్టర్ల కార్మికుల సమస్యలను పరిష్కారించాలంటూ డిమాండ్ చేస్తూ సెంట్రింగ్ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె 5 వ రోజు కొనసాగుతుంది.సమ్మె లో భాగంగా హయత్ నగర్ లో సెంట్రింగ్ కార్మికులు సెంట్రింగ్ కాంట్రాక్టర్స్ సమ్మె చేపట్టి బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సెంట్రింగ్ కార్మికులు మాట్లాడుతూ గత ప్రభుత్వాలకు ఎన్నిసార్లు విన్నవించుకున్న ప్రభుత్వం నుంచి ఎలాంటి సహకారం లేకపోవడంతో సెంట్రింగ్ కార్మికులు నష్టపోతున్నారని వాపోయారు. ప్రధానంగా లేబర్ కార్డు ఉన్న ప్రతి ఒక్క సెంట్రింగ్ కాంట్రాక్టర్ కార్మికులకు ఏదైనా ప్రమాదం జరుగుతే 20 లక్షలు రూపాయలు ఇవ్వాలని ప్రభుత్వంను డిమాండ్ చేశారు.ప్రతి కార్మికుడికి ఈఎస్ఐ కార్డ్ ఇవ్వాలన్నారు. అలాగే సెంట్రింగ్ కార్మికులకు ప్రతి ఒక్కరికి గృహవసతి కల్పించాలని అదేవిధంగా సెంట్రింగ్ కాంట్రాక్టర్లకు బ్యాంకుల ద్వారా వడ్డీ లేని రుణాలు ఇవ్వాలన్నారు. ప్రధానంగా సెంట్రింగ్ మెటీరియల్ నిర్మాణదారుల వద్ద అభద్రతాభావం ఉండడంతో కొంతమంది వ్యక్తులు సెంట్రింగ్ మెటీరియల్ దొంగతనంకు పాల్పడుతున్నారని అలాంటి సెంట్రింగ్ మెటీరియల్ ను స్క్రాప్ దుకాణాలు కొనకుండా వారిపై నిఘా పెట్టి కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం సెంట్రింగ్ కాంట్రాక్టర్ కార్మికుల సమస్యల పట్ల సానుకూలంగా స్పందించి పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. సెంట్రింగ్ పనులలో మధ్యలో మెస్త్రి జోక్యం లేకుండా నేరుగా యజమానితో సంబంధం వుండాలన్నారు. ప్రభుత్వం తమను వెంటనే చర్చలకు పిలిచి సమస్యలను పరిష్కరించాలని లేనిపక్షంలో తమ సమస్యలను పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున పోరాటం ఉధృతం చేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో హయత్ నగర్ జోన్ సెంట్రింగ్ కాంట్రాక్టర్ అసోసియేషన్ అధ్యక్షుడు గువ్వల గణేష్,ఉపాధ్యాక్షుడు అశోక్,ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, ధన్ రాజ్,యాదయ్య,లక్ష్మయ్య,ఎల్లయ్య,మల్లేష్,నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యమకారుల సంక్షేమ కన్వీనర్‌గా బండి మహేష్ ఏకగ్రీవ ఎన్నిక




**ఇబ్రహీంపట్నం,20(తెలంగాణ గీతం)** తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం ఇబ్రహీంపట్నం నియోజకవర్గ కన్వీనర్ గా బండి మహేష్ ఏకగ్రీవంగా బుధవారం ఎన్నుకున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.ఇబ్రహీంపట్నం నియోజకవర్గ అధ్యక్షులుగా జమాల్పురి శ్రీనివాస్ ఎన్నికయ్యారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని ప్రతి ఉద్యమకారులను గౌరవించెందుకు స్టీరింగ్ కమిటీని ఏర్పాటు చేశామని,ఈ నూతన కమిటీలో డి.జగన్ (అడ్వకేట్, జేఏసీ) వేణుగోపాల్ రావు, ఉక్కుల అశోక్ గారు( డాక్టర్స్ జేఏసీ) జర్నలిస్ట్ సంఘం నాయకులు సుర మౌని సత్యనారాయణ, ఆర్ కృష్ణ యాదవ్ (మీడియా జేఏసీ) మోహన్ రెడ్డి,మంచాల (సీనియర్ ఉద్యమకారులు) అఛనా శంకర్( సీనియర్ ఉద్యమాల నాయకులు),రవీందర్నాథ్ గుప్తా, (సీనియర్ పాత్రికేయుడు మరియు జేఏసీ నాయకులు), డి. సత్యనారాయణ ( సీనియర్ ఉద్యమ నాయకులు),చిందం రఘుపతి (సీనియర్ ఉద్యమ నాయకుడు), నూతన గంటి శేఖర్,( ప్రజాసంఘాల నాయకులు) శ్రీ పి జగదీష్,( సీనియర్ ఉద్యమ నేత) మాజీ జేఏసీ చైర్మన్ పసునూరి వినోద్ గుప్తా, (సీనియర్ ఉద్యమ నాయకులు) శెట్టి మల్ల వెంకటేష్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా ఉద్యమకారుల సంక్షేమ సంఘం నియోజకవర్గ కన్వీనర్ గా ఎన్నికైన మహేష్ మాట్లాడుతూ...ప్రభుత్వం ప్రతి ఉద్యమకారుని గుర్తించి వారికి ఇంటి స్థలాలు అలాగే పింఛన్ విద్యా వైద్య రంగాలలో రాయితీ కల్పించాలని డిమాండ్ చేశారు.త్వరలోనే ఇబ్రహీంపట్నంలో ఉద్యమకారుల సమావేశాన్ని ఏర్పాటు చేసి ప్రతి ఒక్క ఉద్యమకారునికి గుర్తింపు పత్రాన్ని అందచేస్తామని తెలిపారు.ఈ సందర్భంగా మంచాల మండల కోఆర్డినేషన్ కమిటీని నియమించారు.

## నేడు 12వార్డులో పించన్ దరఖాస్తు చేసుకోవాలి :కౌన్సిలర్ త్రిలోక్



**ఇబ్రహీంపట్నం,20(తెలంగాణ గీతం )** ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలోని 12వ వార్డులోని అంగన్ వాడీ స్కూల్ లో నేడు 12వార్డుకు చెందిన వృద్దులు,వింతతుల పెన్షన్ కొరకు నేడు ఉదయం 9గంటల నుండి అర్జీలు పెట్టుకోవాలని వార్డు కౌన్సిలర్ కొండిగారి త్రిలోక్ కుమార్ తెలిపారు.ఆధార్ కార్డుతో పాటు మీ దగ్గర ఉన్న ఏవైనా ఆధారాలు ఉంటే అంగన్వాడీ స్కూల్ వద్దకు వచ్చి అధికారులకు అందజేయాలని, ముఖ్యంగా 12వ, వార్డులోని వడ్డెర బస్తీలో చాలా మంది 60సంవత్సరాలకు పైగా వయస్సు ఉన్నవారు కానీ భర్త లేనివారు మరియు పించనుకు అర్హులైన ప్రతీ ఒక్కరు వచ్చి దరఖాస్తు చేసుకోగలరని కాలనీ వాసులను కౌన్సిలర్ త్రిలోక్ కుమార్ కోరారు.